సాక్షి వరంగల్

ఆదివారం । 10 । నవంబర్ । 2024



ఫొటోగ్రాఫర్లకు ఉపాధి గండం

స్మార్ట్‌ఫోన్లతో ఫొటోగ్రాఫర్ల జీవనోపాధి దెబ్బతింటోంది. వినియోగదారుల ఆదరణ లేక చాలా చోట్ల వారు స్టూడియోలను ఎత్తివేస్తున్నారు.

- 8లో▸



తెలంగాణకే తలమానికం..

ఒగ్గు కథ పితామహుడు చుక్కా సత్తయ్య తెలంగాణ రాష్ట్రానికే తలమానికమని టీజీకేడీ వ్యవస్థాపక అధ్యక్షుడు పృథ్వీ అన్నారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
$31^0/18^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఎండ ఉంటుంది. రాత్రి సమయంలో చలితోపాటు మంచు కురుస్తుంది.

ఎదురు ప్రశ్నలు

తొలిరోజు సమగ్ర కుటుంబ సర్వేలో ఎన్యుమరేటర్లపై ప్రజల తీరు

- ఆస్తులు, భూముల వివరాలు చెప్పేందుకు ససేమిరా..
- రైతు భరోసా రాలే, పింఛన్ ఇవ్వడం లేదని ఆవేదన
- ఒక్కో కుటుంబానికి గంటకుపైగా తీసుకుంటున్న సమయం
- కొన్ని చోట్ల కుటుంబాలు లేక వివరాల నమోదులో ఆలస్యం



వర్ధన్నపేటలో సర్వేను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ సుధీర్‌కుమార్, చైర్‌పర్సన్ ఆంగోత్ అరుణ

సాక్షి, వరంగల్: జిల్లాలో రెండో దశ సమగ్ర కుటుంబ సర్వేకు ఆదిలోనే ఆటంకాలు ఏర్పడుతున్నాయి. సర్వేలో భాగంగా ఈనెల 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ఇంటింటికి స్టిక్కరింగ్ వేయడం పూర్తి చేసిన ఎన్యుమరేటర్లు.. శనివారం నుంచి సర్వే చేయడం ప్రారంభించారు. ప్రతి ఇంట్లో నివసించే వారి సంఖ్యను నిర్ధారించడంతోపాటు ప్రతి కుటుంబానికి సంబంధించిన ప్రాథమిక సమాచారం సేకరించి (ఇంటి నంబర్, ఇంటి యజమాని పేరు వంటి వివరాలు) ఫారంలో నమోదు చేస్తున్నారు. ఒక్కో కుటుంబానికి గంటకు పైగా సమయం పడుతోంది. చాలా మంది తమ ఆస్తుల వివరాలు చెప్పేందుకు ఆసక్తి చూపకపోవడంతో ఎన్యుమరేటర్లు సర్ది చెప్పాల్సిన పరిస్థితి ఎదురైంది. కుటుంబ వివరాలు చెబుతున్న క్రమంలోనే ఆ తర్వాత ఎన్యుమరేటర్ల నుంచి వస్తున్న ప్రశ్నలకు 'వ్యవసాయం చేస్తున్నా.. రైతు బంధు రాలే.. రైతు భరోసా రాలే.. నా భూమి వివరాలు ఎందుకు అంటూ' కొందరు ఎదురు ప్రశ్నించారు.

పింఛన్ రావడం లేదు.. ఎప్పుడు ఇస్తారు అని తిరిగి ప్రశ్నిస్తుండడంతో నచ్చజెప్పడం ఎన్యుమరేటర్లకు తలకు మించిన భారమవుతోంది. ముఖ్యంగా భూములు, ఆస్తుల వివరాలు చెప్పడం లేదు. వృత్తికి సంబంధించి చాలా మంది గృహిణి, రోజువారి కూలీ అని చెబుతున్నారు. ప్రజలు చెప్పిన సమాచారాన్ని తీసుకోవాలనే నిబంధన ఉండడంతో వారు చెప్పిందే ఎన్యుమరేటర్లు నమోదు చేస్తున్నారు. కొందరు కులం పేరు చెప్పేందుకు ఆసక్తి చూపకపోవడంతో 999 కోడ్, ఏ సామాజికవర్గం లేదు అంటే 01 కోడ్‌తో ఎన్యుమరేటర్లు నోట్ చేసుకున్న ఘటనలు నగరంలోని కొన్ని ప్రాంతాల్లో చోటుచేసుకుంటున్నాయి. ఒక్కో ఎన్యుమరేటర్ 10 ఇళ్లకు మించి సర్వే చేయకపోవడం గమనార్హం. కొన్ని కుటుంబాలు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందికర పరిస్థితి ఏర్పడింది. వరంగల్ నగరంలోని కొన్ని డివిజన్లలో సూపర్‌వైజర్లు అందుబాటులో లేకపోవడంతో ఎన్యుమరేటర్లు నింపాదిగా సర్వే చేయడం కనిపించింది. అక్కడక్కడా ఎన్యుమరేటర్లుగా ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉండడంతో ఫారాలు నింపడం వారికి కష్టంగా మారింది. ప్రతిరోజూ ప్రతి ఎన్యుమరేటర్ కనీసం 10 కుటుంబాలు సర్వే చేయాల్సి ఉంది. కానీ, మొదటి రోజు ఒక్కో ఎన్యుమరేటర్ సగటున నాలుగు నుంచి ఆరు కుటుంబాలను మాత్రమే సర్వే చేశారు.

జిల్లాలో 2.63 లక్షల కుటుంబాలు

- 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో 2.63 లక్షల కుటుంబాలు ఉన్నాయి.
- 150 కుటుంబాలకు ఒక గణకుడు చొప్పున 1,841 ఎన్యుమరేటర్లు సర్వే చేస్తున్నారు.
- 10 మంది ఎన్యుమరేటర్లను ఒక సూపర్‌వైజర్‌ను పర్యవేక్షణ చేస్తున్నారు.
- ఒక్కో ఎన్యుమరేటర్ నాలుగు నుంచి ఏడు కుటుంబాలను సర్వే చేశారు.

మరికొన్ని ఇలా..

- కులం తెలిపే క్రమంలో ఉప కులాలు చెప్పడంలో కుటుంబ సభ్యులు తడబడుతున్నారు.
- ఇద్దరు భార్యలు ఉన్న కుటుంబంలో ఒకే ఫారం నింపుతున్నారు. దీంతో వేర్వేరుగా సమాచారం తీసుకోవాలని ఆ కుటుంబ సభ్యులు అభ్యంతరం చెబుతున్నారు. దీంతో ఎన్యుమరేటర్లు వారికి సర్దిచెప్పి నిబంధనల ప్రకారం ఒకే ఫారంలో వేర్వేరుగా వివరాలు సేకరిస్తున్నారు.
- ఇంటికి విద్యుత్ కనెక్షన్ ఉందా లేదా అని ఎన్యుమరేటర్లు వివరాలు సేకరిస్తున్నారు. కాలనీ, ఇతర ప్రాంతాల్లో అనధికార విద్యుత్ సరఫరా ఉండడంతో ఆ వివరాలు చాలా మంది చెప్పడం లేదు. అయితే, ఆ ఇళ్లలో విద్యుత్ సౌకర్యం ఉండడంతో 01 ఆప్షన్‌ను సదరు ఫారంలో ఎన్యుమరేటర్ నమోదు చేస్తున్నారు.

పక్కాగా సర్వే వివరాలు నమోదు చేయాలి

- కలెక్టర్ సత్యశారద

సంగెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేలో తప్పులు దొర్లకుండా 57 అంశాలను పక్కాగా నమోదు చేయాలని కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. మండలంలోని తీగరాజుపల్లి, గవిచర్ల గ్రామాల్లో శనివారం ఇంటింటి సర్వే తీరును పరిశీలించారు. ఏమైనా సమస్యలు ఎదురవుతున్నాయా అని ఎన్యుమరేటర్లను అడిగి తెలుసుకున్నారు. ఇబ్బందులు ఉంటే సూపర్‌వైజర్లు, ప్రత్యేకాధికారుల దృష్టికి తీసుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో సర్వే నోడల్ అధికారి, జెడ్పీ సీఈఓ జి.రాంరెడ్డి, సీపీఓ బి.గోవిందరాజన్, డీఎల్‌పీఓ, మండల ప్రత్యేకాధికారి వేదవతి, తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీఓ రవీందర్, ఎంపీఓ కొమురయ్య, నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి మమత, శరత్, ఎన్యుమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



తీగరాజుపల్లిలో సర్వే తీరును పరిశీలించి సూచనలు చేస్తున్న కలెక్టర్ సత్య శారద

ప్రణాళికాబద్ధంగా కుటుంబ సర్వే

వరంగల్: ప్రణాళికాబద్ధంగా కుటుంబ సమగ్ర సర్వే నిర్వహిస్తున్నామని కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. హైదరాబాద్ నుంచి సీఎస్ శాంతికుమారి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాతో కలిసి శనివారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 2.63 లక్షల కుటుంబాలు ఉన్నట్లు అంచనా వేసినట్లు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ ఎలాంటి సందేహాలున్నా ఎన్యుమరేటర్లు కలెక్టర్ల దృష్టికి తేవాలని సూచించారు. ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, సీపీఓ గోవిందరాజన్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బ్రిటీషోళ్లు మెచ్చిన

న్యాయ విధానం మనది



కార్యక్రమంలో మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ సుజయ్ పాల్, వేదికపై సభ్య కార్యదర్శి పంచాక్షరి, రెండు జిల్లాల న్యాయమూర్తులు నిర్మలాంబ, సీహెచ్ రమేశ్‌బాబు, కలెక్టర్లు ప్రావీణ్య, సత్య శారద తదితరులు

- ఉచిత న్యాయ సహాయం స్వాతంత్య్రం రాక ముందే ఉంది
- రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ సుజయ్ పాల్

నయీంనగర్: 'ఉచిత న్యాయ సహాయం అనేది స్వాతంత్య్రానికి ముందు నుంచే ఉంది. టీమ్ ఆఫ్ ఇండియన్ అడ్వకేట్స్ కలిసి సుభాష్ చంద్రబోస్‌కు ఉచిత న్యాయ సహాయం అందించారు. అప్పటి నుంచే ఉచిత న్యాయ సహాయానికి బీజం పడింది. భారత న్యాయ విధానం బ్రిటిష్ వారికి కూడా నచ్చింది. ఆనాడే రాజ్యాంగంలో ఉచిత న్యాయ సహాయం లిఖించబడింది' అని తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ సుజయ్ పాల్ అన్నారు. శనివారం న్యాయ సేవాధికార సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వరంగల్–హనుమకొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన లీగల్ సర్వీసెస్ డే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ సుజయ్ పాల్ మాట్లాడుతూ.. ప్రజలకు ప్రాథమిక హక్కులు విధులు గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, స్వయం సహాయక సంఘాల ద్వారా గడపగడపకూ న్యాయ సేవలు అందేలా న్యాయ సేవాధికార సంస్థలు చూడాలని ఆయన కోరారు.

మీడియేషన్ వ్యవస్థతో సత్ఫలితాలు..

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో కమ్యూనిటీ మీడియేషన్ వ్యవస్థను ఏర్పాటు చేశామని ఇది సమర్థంగా పనిచేస్తూ ప్రజల మధ్య వివాదాలను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరిస్తోందన్నారు. ప్రజలకు న్యాయం అందించే ప్రక్రియను అందరి భాగస్వామ్యంతో క్షేత్రస్థాయిలో నిర్వహించాలన్నారు. తెలంగాణలో న్యాయ సేవా సంస్థలు చిత్తశుద్ధితో పనిచేస్తున్నాయని సంతోషాన్ని వ్యక్తం చేశారు. పూర్వం విడాకుల మాట చాలా తక్కువగా వినేవాళ్లమని.. భార్యాభర్తలు విడాకులు తీసుకోవడం బాధాకరమన్నారు. మధ్యవర్తిత్వం ద్వారా కౌన్సెలింగ్ ఇప్పించి వైవాహిక జీవితాన్ని కొనసాగించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వారు పేర్కొన్నారు. సభ్య కార్యదర్శి పంచాక్షరి మాట్లాడుతూ.. సత్వర న్యాయం సమన్యాయం, న్యాయ సేవాధికార సంస్థల విశిష్టతను గ్రామస్థాయిలో కూడా విస్తృతపర్చాలన్నారు. న్యాయ సేవా సంస్థల పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించి, వారికి లబ్ధి కలిగేలా న్యాయ సేవాధికార సంస్థలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీడబ్ల్యూఓ, శ్రీగురు దేవా చారిటబుల్ ట్రస్ట్, కేఎస్ఎం ఫౌండేషన్ల ద్వారా వైకల్యం కలిగిన వారికి లింబ్స్, వీల్ చైర్లు, ట్రైసైకిల్స్, స్వయం సహాయక సంఘాలకు చెక్కులు అందించారు. ప్రభుత్వ వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను జస్టిస్ సుజయ్ పాల్ సందర్శించి నిర్వాహకులతో మాట్లాడారు. కార్యక్రమం జరుగుతుండగా 6 నిమిషాలు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో ఒకింత గందరగోళం నెలకొంది. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి (అడ్మినిస్ట్రేషన్ జడ్జి) జస్టిస్ మౌషుమీ భట్టాచార్య (వర్చువల్‌గా), సభ్య కార్యదర్శి పంచాక్షరి, వరంగల్, హనుమకొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్లు, న్యాయమూర్తులు బీవీ.నిర్మలా గీతాంబ, సీహెచ్.రమేశ్‌బాబు, వివిధ కోర్టుల న్యాయమూర్తులు, పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ, కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, పి.ప్రావీణ్య, న్యాయ సేవాధికార సంస్థల కార్యదర్శులు ఎం.సాయికుమార్, క్షమాదేశ్ పాండే, భారత్ సేవక్ ప్రెసిడెంట్లు తీగల జీవన్‌గౌడ్, ఎం.రమేశ్‌బాబు, తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులు బైరపాక జయాకర్, సిరికొండ సంజీవరావు, తదితరులు పాల్గొన్నారు.



హాజరైన న్యాయవాదులు, నగర ప్రముఖులు, ప్రజలు



దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందజేస్తున్న జస్టిస్ సుజయ్ పాల్ తదితరులు

ఉచిత వైద్య శిబిరం..

లీగల్ సర్వీస్ డే సందర్భంగా అంబేడ్కర్ భవన్‌లో వరంగల్–హనుమకొండ డీఎంహెచ్‌ఓల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం, హెల్త్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. డీఎంహెచ్‌ఓలు బి.సాంబశివరావు, అల్లెం అప్పయ్య, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలి

వరంగల్: ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద శనివారం ఒక ప్రకటనలో సూచించారు. (స్వీప్) ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం–2025లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఆదివారం కూడా ప్రత్యేక ఓటరు నమోదు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 1 జనవరి 2025 నాటికి 18 సంవత్సరాలు నిండే యువత కొత్త ఓటరుగా నమోదు చేసుకునేందుకు, మార్పులు, చేర్పులు, వెలువడిన ఓటరు జాబితాలో అభ్యంతరాలు తెలిపేందుకు బూత్ లెవల్ ఆఫీసర్లు తమ బూత్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. నూతన ఓటరుగా నమోదుకు ఫారం–6, అక్టోబర్ 29న విడుదల చేసిన ఓటరు ముసాయిదా జాబితాలో అభ్యంతరాల కోసం ఫారం–7, సవరణలకు ఫారం–8లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. voters.eci.gov.in వెబ్‌సైట్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.

రేపటి నుంచి జోనల్‌స్థాయి క్రీడలు



రాయపర్తి : మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఈనెల 11 నుంచి 14వ తేదీ వరకు పదో జోనల్‌స్థాయి క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు మల్టీజోనల్ ఆఫీసర్ కె. అలివేలు తెలిపారు. ఈ మేరకు శనివారం క్రీడలకు సంబంధించిన ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా వరంగల్ డీసీఓ అపర్ణ, హనుమకొండ డీసీఓ ఉమామహేశ్వరి, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లతో కలిసి కార్యక్రమ నిర్వహణలో జోనల్ మీట్‌కు సంబంధించిన అన్ని కమిటీల సభ్యులతో కార్యాచరణ గురించి చర్చించారు. కార్యక్రమ నిర్వహణలో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాల్గొని ఈ జోనల్ క్రీడోత్సవాలను విజయవంతం చేయాలని కమిటీల సభ్యులందరినీ కోరారు. డీసీఓ సమ్మయ్య, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, సభ్యులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్‌తో అధిక లాభాలు



దుగ్గొండి: ఆయిల్‌పామ్ తోటల సాగుతో రైతులకు ఆర్థికంగా లాభదాయకంగా ఉంటుందని జిల్లా ఉద్యానశాఖ అధికారి సంగీతలక్ష్మి అన్నారు. మండలంలోని పొనకల్ గ్రామంలో రైతు బుస్సారి బాబురావు ఆయిల్‌పామ్ తోటలో రైతులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సాధారణ పంటల సాగుతో కూలీల కొరత, గిట్టుబాటు ధర లేకపోవడం, ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోతున్నారన్నారు. భవిష్యత్‌లో మంచి లాభాలు ఇచ్చేలా సాగు ఖర్చులు తక్కువగా ఉండి, అధిక లాభాలు వచ్చే పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. నాటిన 36 నెలలకు మొదటి పంట దిగుబడి వస్తుందని, 30 నుంచి 35 ఏళ్ల వరకు పంట దిగుబడులు తీసుకోవచ్చని వివరించారు. మరో 6 నెలల్లో పంట కోత ప్రారంభమవుతుందని, రాంచరణ్ ఆయిల్ ఇండస్ట్రీస్ వారితో జిల్లా వ్యాప్తంగా సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసి అక్కడే రైతుల నుంచి కొనుగోలు చేయనున్నట్లు పేర్కొన్నారు. రాంచరణ్ ఆయిల్ ఇండస్ట్రీస్ జీఎం సతీశ్‌నారాయణ, ఉద్యానశాఖ అధికారి జ్యోతి, ఫీల్డ్‌ఆఫీసర్ అనిల్, దేవరాజు, రైతులు పెండ్యాల రాజు, గుండె రాజేందర్, అరుణాబాయి, శ్రీరామోజు ప్రభాకర్, రైతులు పాల్గొన్నారు.

రుద్రేశ్వరుడికి లక్ష పుష్పార్చన

హన్మకొండ కల్చరల్: వేయిస్తంభాల ఆలయంలో నిర్వహిస్తున్న కార్తీక మాసోత్సవాల్లో భాగంగా శనివారం రుద్రేశ్వరస్వామికి లక్ష పుష్పార్చన నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వేద పండితుడు మణికంఠశర్మ, అర్చకుడు ప్రణవ్ ఉదయం ఉత్తిష్ట గణపతికి పుట్ట తేనెతో అభిషేకం, స్వామివారికి పాశుపత రుద్రాభిషేకం జరిపారు. ఆధ్యాత్మికవేత్త ప్రభాకర్ స్వరూప దంపతుల సౌజన్యంతో హైదరాబాద్ నుంచి తెప్పించిన బంతి, చామంతి, గులాబీ, లిల్లీ, పారిజాతం తదితర పుష్పాలకు సంప్రోక్షణ నిర్వహించి లక్ష రుద్రనామాలతో స్వామివారికి లక్షపుష్పార్చన నిర్వహించారు. సెలవు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో దేవాలయాన్ని సందర్శించారు. మహిళలు ఉసిరిక దీపాలు, ఉసిరిచెట్టు పూజలు, దీపదానాలు చేశారు. ప్రదోషకాల పూజలు నిర్వహించారు. ఆదివారం స్వామివారికి తులసీ దళార్చన నిర్వహిస్తామని గంగు ఉపేంద్రశర్మ తెలిపారు.

పీఏసీఎస్‌లో విచారణకు నోటీసుల జారీ

చెన్నారావుపేట: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)లో జరుగుతున్న అవినీతి అక్రమాలపై విచారణ చేయడానికి రాష్ట్ర విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఈ నెల నాలుగో తేదీన నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు చెన్నారావుపేట సొసైటీలో డైరెక్టర్ల వ్యవహారం, పెట్రోల్‌బంకులోని ఖాతాలు, గోదాం నిర్మాణాల పేరుతో ముందస్తుగా చెల్లింపులతోపాటు పలు అంశాలపై కొంతమంది రైతులు ఇటీవల రాష్ట్రస్థాయి అధికారులకు ఫిర్యాదు చేశారు. అంతే కాకుండా సొసైటీలో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఈ విషయంపై సీఈఓ చిట్టి రవిని వివరణ కోరగా విజిలెన్స్ అధికారులు కార్యాలయానికి వచ్చి రికార్డులు పరిశీలించారని, విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

నకిలీ స్టాంపులతో రుణాలు..

పంట రుణాల కోసం గుట్టు చప్పుడు కాకుండా నకిలీ స్టాంపులు తయారు చేసుకుని రుణాలు పొందినట్లు వెలుగులోకి వచ్చింది. రైతులు రుణాలు తీసుకోవాలంటే నో డ్యూ (ఏ బ్యాంకులో అప్పు లేదని ధ్రువీకరణ పత్రం) సర్టిఫికెట్ తీసుకుని రావాలి. దీంతో ఇతర బ్యాంకుల్లో పంట రుణాలు పొందిన దళారులు బ్యాంకు అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి, బ్యాంకు పేరుతో నకిలీ స్టాంపులు తయారు చేసుకుని వేస్తున్నారు.



చెన్నారావుపేటలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం

నకిలీపత్రాల కోసం వసూళ్లు..

నకిలీ పత్రాల కోసం ఒక్కొక్కరి వద్ద రూ.1000 నుంచి రూ. 2000 తీసుకున్నట్లు తెలిసింది. సొసైటీలో రుణం కోసం దరఖాస్తు చేసుకున్న రైతులు చెక్కు తీసుకుని బ్యాంకుకు వెళ్లడంతో మేనేజర్‌కు అనుమానం వచ్చింది. వారి ఖాతాలను పరిశీలించగా గతంలో పంట రుణం పొందినట్లు గుర్తించారు. దీని ద్వారా నకిలీ స్టాంపుల దందా వెలుగులోకి వచ్చింది. ఈ విషయమై ఎస్‌బీఐ మేనేజర్ మోహన్ కాంత్‌ను వివరణ కోరగా గతంలో రుణం తీసుకున్న వారిలో ముగ్గురు మళ్లీ మళ్లీ రుణం తీసుకున్నట్లు గుర్తించి ఉన్నతాధికారులకు వివరాలు పంపించినట్లు తెలిపారు.

హామీల అమలులో కాంగ్రెస్ కాలయాపన

ఖానాపురం: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని మాజీ ఎంపీ, బీజేపీ నాయకుడు సీతారాంనాయక్, బీజేపీ ఇల్లందు నియోజకవర్గ ప్రవాసీ కంభంపాటి పుల్లారావు అన్నారు. ఈ మేరకు మండలంలోని బుధరావుపేటలో శనివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పరిపాలన చేయరాని కాంగ్రెస్‌ను ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. కాంగ్రెస్ హామీల కాలయాపనను నిరసిస్తూ డిసెంబర్ 5 నుంచి ప్రతీ మండలంలో పాదయాత్రలు నిర్వహిస్తూ నిరసనలు చేపడతామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భాష సరిగా ఉండడం లేదని, సీఎం స్థాయిలో ఉండి భాష మార్చుకోలేకపోవడం దుర్మార్గమన్నారు. ఎవరి మీదకు బుల్డోజర్లు పంపుతారని ప్రశ్నించారు. ప్రజలే ఎదురు తిరిగే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ఈనెల 15న ములుగులోని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం వద్ద నిర్వహించనున్న బిర్సాముండా జయంతి వేడుకలకు కేంద్ర మంత్రులు హాజరవుతున్నారని తెలిపారు. 10 వేల మందితో నిర్వహించే బహిరంగ సభకు బీజేపీ నాయకులు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు జల్లి మధు, పంజాల రాము, బాల్నె జగన్, శ్రీనివాస్, పుల్ల య్య, రాజేందర్, మల్లారెడ్డి, రమేశ్, రాములు, లకుపతి, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీతారాం నాయక్, పుల్లారావు

టెక్నోఫెస్ట్.. అదరహో

- రెండో రోజు అబ్బురపరిచిన టెక్నోజియాన్–24 ఈవెంట్లు
- ఉత్తేజాన్నిచ్చిన డాక్టర్ తనుజైన్ మాజీ ఐఏఎస్ ప్రసంగం
- నేటితో సాంకేతికోత్సవం ముగింపు

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లో టెక్నోజియాన్–24 మూడు రోజుల వేడుకల్లో భాగంగా రెండో రోజు శనివారం జరిగిన కార్యక్రమాలు అలరించాయి. మొదట మాజీ ఐఏఎస్ అధికారి తనుజైన్ అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో చిట్‌చాట్ చేశారు. మ్యాథ్స్‌కేర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ గజేంద్రపురోహిత్ గెస్ట్ లెక్చర్ ఆకట్టుకుంది. మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, మెకానికల్, కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈవెంట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు రూపొందించిన ఫీల్ ది పెయిన్, ఫోరెన్సిక్ ఇన్వెస్టిగేషన్, ఫ్యూచర్ మేనేజర్, సీకాడ క్విజ్, డచ్ యాక్షన్, డ్రోన్ వెలాసిటీ, బిల్డ్ ఏ పంచ్, కెమ్ రిలే, మెకానికల్ విభాగంలో వెహికల్ షో, వరంగల్ రోబోటిక్స్ సంస్థ ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



ఎగ్జిబిట్లను ప్రదర్శిస్తున్న విద్యార్థులు





నేటితో ముగియనున్న సాంకేతికోత్సవం

సాంకేతిక మహోత్సవాలు ఆదివారం మూడో రోజు ముగియనున్నాయి. చివరి రోజు ఎస్కేప్ రూం, ఆస్ట్రో వరల్డ్, క్యాంపస్ ఇన్నోవేటిస్ ఈవెంట్లు నిర్వహించనున్నారు.

- మరిన్ని సాంకేతిక ప్రదర్శనలు 8లో▸

బాయ్స్.. ఫీల్ ద పీరియడ్స్ పెయిన్..

మహిళలకు ప్రతినెలా పీరియడ్స్ సమయంలో ఎదురయ్యే కడుపునొప్పిని మగవారికి తెలియాలనే ఆలోచనతో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థినులు సిమ్యులేటర్‌ను రూపొందించారు. టెక్నోజియాన్‌లో భాగంగా వారు రూపొందించిన టెక్నాలజీని పలువురు బాయ్స్‌పై ప్రదర్శించారు.



ఫోరెన్సిక్‌తో కేసును పట్టు..

వివిధ రకాల కేసుల్లో కీలకపాత్ర పోషించే ఫోరెన్సిక్ ఇన్వెస్టిగేషన్ పరీక్షలను డీఎన్ఏ వేలిముద్రలతో తెలిపేలా కెమిస్ట్రీ ఇంజనీరింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఎగ్జిబిట్ రూపొందించారు. వేలిముద్రతో దొంగలను దొరకపట్టు.. కేసును చేత పట్టు అంటూ చూపారు.

ఆకాశమే హద్దుగా డ్రోన్ షో



ఆకాశమే హద్దుగా పైకి ఎగురుతానంటూ డ్రోన్ షో నిర్వహించారు. నిట్ రోబోటిక్స్ క్లబ్ రూపొందించిన డ్రోన్స్ రాబోయేతరంలో దేశరక్షణకు, వైద్య రంగంలో ఉపయోగపడే అవకాశం ఉంది. రాత్రి వేళలోనూ డ్రోన్ వేగాన్ని పసిగట్టేందుకు, వాటిని గుర్తించేందుకు అమర్చిన లేజర్ లైట్స్ వెలుగులు విరజిమ్మాయి.

వెహికిల్ షో అదుర్స్..



నిట్ వరంగల్‌లోని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం విద్యార్థులు మెక్ఎక్స్ బృందం పేరిట మెక్ హోలిస్టర్ రూపొందించిన రేస్ కార్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కొండలు గుట్టల్లో, ఎత్తయిన ప్రదేశాలపైకి సునాయాసంగా రేస్‌కార్ మాదిరిగా దూసుకెళ్తుందని తెలిపారు.

నదులను శుభ్రం చేసేద్దాం..



నదులను దర్శించుకున్నంత వరకు ఒకే కాని వాటిలో చెత్తాచెదారం, ప్లాస్టిక్ వస్తువులను పడేసి అపరిశుభ్రంగా మారుస్తున్న మానవులకు తమ బాధ్యతను తెలిపేందుకు క్లీనింగ్ ద బోట్‌ను వరంగల్‌కు చెందిన మన్విత రూపొందించింది. రోబోటిక్ టెక్నాలజీతో కిలోమీటరు దూరం నుంచి ఆపరేట్ చేస్తూ నదులను క్లీనింగ్ చేసే టెక్నాలజీని ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

నువ్వా నేనా.. బాట్ ఫైట్..



నువ్వా నేనా బాట్ ఫైట్‌ను రోబోటిక్స్ టెక్నాలజీతో నగరానికి చెందిన శివ రూపొందించి ప్రదర్శించారు. నేటి ఆధునిక యుగంలో సెల్‌ఫోన్లలోని గేమ్స్‌తో కాలక్షేపం చేస్తున్న చిన్నారులకు టెక్నాలజీతో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు బాట్ ఫైట్ పేరిట పోటీతత్వాన్ని పెంపొందిస్తుందని శివ తెలిపారు.

నిట్‌లో సాంకేతిక సందడి..



నేనే ఫ్యూచర్ మేనేజర్..

ఇండస్ట్రీ ఏదైనా నేనే ఫ్యూచర్‌మేనేజర్ అంటూ మేనేజ్‌మెంట్ స్టడీస్ సొసైటీ ఏర్పాటు చేసిన ఈవెంట్ అబ్బురపరిచింది. వంద మంది ఒకే వేదికపై పాల్గొని ప్రదర్శన ఇవ్వగా సత్తా చాటి నేను ఫ్యూచర్‌మేనేజర్ అంటూ నైపుణ్యాన్ని ప్రదర్శించి ఆకట్టుకున్నారు. టెక్నోజియాన్ వేదికగా రాబోవు రోజుల్లో పారిశ్రామిక రంగంలోనూ రాణిస్తామంటూ అదరగొట్టారు.



కాయిన్ వెయ్యి.. చాక్లెట్ పట్టు

చెయ్యి చాపు.. కాయిన్ వేయ్.. చాక్లెట్ పట్టు అంటూ నగరానికి చెందిన రిత్విక్, ఆశీశ్‌లు రూపొందించిన చాక్లెట్ డిస్పెన్సర్ ప్రత్యేకంగా ఆకట్టుకుంది. రోబోటిక్స్ టెక్నాలజీతో రూపొందించిన చాక్లెట్ డిస్పెన్సర్ మిషన్‌లో కాయిన్ వెయ్యగానే చాక్లెట్ అందజేస్తుంది.

నింగిలోకి ఏకకాలంలో నాలుగు మిసైల్స్



అక్షయ్ ఆటోమేటెడ్ మిసైల్ లాంచింగ్ సిస్టమ్‌ను నగరానికి చెందిన రాకేష్ ఆవిష్కరించాడు. ఏకకాలంలో నాలుగు మిసైల్స్‌ను నింగిలోకి పంపించేందుకు ఈ టెక్నాలజీ తోడ్పడుతుంది. ఆర్మీ రంగంలో ఆటోమెటెడ్ మిసైల్ లాంచింగ్ రాబోయే రోజుల్లో ప్రత్యేక భూమిక పోషించనుందని రాకేష్ తెలిపాడు.



టెక్నోజియాన్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఐఏఎస్ డాక్టర్ తనుజైన్





ఎగ్జిబిట్లు ప్రదర్శిస్తున్న విద్యార్థులు- కాజీపేట అర్బన్

రైళ్ల రాకపోకల పునరుద్ధరణ



ట్రాక్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

డోర్నకల్: డోర్నకల్ రైల్వే జంక్షన్ పరిధిలోని బైపాస్ మీదుగా శనివారం తెల్లవారుజాము నుంచి రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారు. కొండపల్లి నుంచి భద్రాచలం రోడ్‌కు వెళ్తున్న గూడ్సు రైలు మూడు బోగీలు శుక్రవారం రాత్రి బైపాస్‌లో పట్టాలు తప్పగా అధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. రైలుకు సంబంధించిన 17, 18, 19వ బోగీలు పట్టాలు తప్పాయి. 17, 18వ బోగీలను ముందుకు, బ్యాక్ బోగీలను ఇంజన్ సాయంతో వెనకకు తరలించారు. అడ్డుగా ఉన్న బోగీని భారీ యంత్రాలతో పక్కకు తప్పించి దెబ్బతిన్న ట్రాక్‌కు మరమ్మతులు చేసి సుమారు మూడు గంటల వ్యవధిలోనే బైపాస్‌లో కొండపల్లి, భద్రాచలం రోడ్ స్టేషన్ల మధ్య రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారు.

రెండు తలల మేక పిల్ల జననం



మృతి చెందిన మేకపిల్ల

నెల్లికుదురు: రెండు తలలతో మేక పిల్ల జన్మించింది. ఈ ఘటన శనివారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. నెల్లికుదురుకు చెందిన కావటి పిచ్చయ్యకు చెందిన మందలో ఒక మేక రెండు తలల పిల్లకు జన్మనిచ్చింది. పుట్టిన వెంటనే ఆ పిల్ల మృతి చెందింది. కాగా, జన్యులోపంతో అలా పుట్టిన మేకపిల్లలు జన్మించిన వెంటనే చనిపోతాయని పశువైద్యాధికారి తెలిపారు.

ఫొటోగ్రాఫర్లకు ఉపాధి గండం

స్మార్ట్‌ఫోన్ల దెబ్బకు విలవిల

- వినియోగదారుల ఆదరణ లేక అవస్థలు
- చాలా చోట్ల స్టూడియోల ఎత్తివేత
- ప్రభుత్వం పట్టించుకోవాలని వేడుకోలు



కాజీపేట : ఫొటో.. గతం తాలుకు తీపి గుర్తు. మరుపురాని, మరవలేని జ్ఞాపకం. ఎప్పటికీ చెదిరిపోని మధుర స్మృతి. అందుకే తమ జ్ఞాపకాలను భద్రపరచుకోవడానికి ప్రతి ఒక్కరూ ఫొటో తీయించుకునే వారు. దీంతో ఒకప్పుడు ఫొటో స్టూడియోలు కళకళలాడేవి. ఫొటోగ్రాఫర్లకు చేతినిండా పని లభించేంది. అయితే ప్రస్తుత కాలంలో స్మార్ట్ ఫోన్ల దెబ్బతో ఫొటోగ్రాఫర్ల జీవనోపాధి దెబ్బ తింటోంది. అధునాతన టెక్నాలజీతో మార్కెట్‌లోకి వస్తున్న స్మార్ట్ ఫోన్ల వైపే ప్రజలు మొగ్గుచూపుతున్నారు. దీంతో చిన్న కార్యక్రమాలకు ఫొటోగ్రాఫర్లను పిలవడం మానేశారు. వివాహాది, శుభకార్యాలకు మాత్రమే వినియోగిస్తున్నారు. ఫలితంగా పెళ్లిళ్ల సీజన్ తప్ప మిగతా సమయంలో పెద్దగా గిరాకీ ఉండడం లేదని పలువురు ఫొటోగ్రాఫర్లు వాపోతున్నారు. క్రమేణా ఉపాధి కొరవడడంతో జిల్లాలో ఏటా ఫొటోగ్రాఫర్ల సంఖ్య తగ్గుతోంది.

ఉమ్మడి జిల్లాలో 1016కు పైగా స్టూడియోలు..

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సుమారు 1016 పైగా ఫొటో స్టూడియోలు, 7వేల మందికి పైగా ప్రత్యక్షంగా, పరోక్షంగా వృత్తిపైనే ఆధారపడి జీవించే ఫొటోగ్రాఫర్లు ఉన్నారు. ఉన్నత విద్యనభ్యసించిన వారు కూడా సరైన ఉద్యోగావకాశాలు లేక ఈ రంగంలోకి రావడంతో పోటీ పెరిగింది. ప్రస్తుతం సరైన ఉపాధి లేకపోవడంతో షాపుల అద్దెలు, కరెంట్ బిల్లులు, సిబ్బందికి జీతాలు చెల్లించలేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అన్నింటా గడ్డుకాలం..

గతంలో ఫొటోగ్రాఫర్లు సరైన పని లేని సమయంలో కనీసం పాస్‌పోర్టు సైజు ఫొటోల ద్వారా అయినా ఉపాధి పొందే వారు. ప్రస్తుతం ఆ పరిస్థితి కూడా లేదు. ఎవరికి వారు తమ స్మార్ట్ ఫోన్‌లో ఫొటో తీసుకుని కలర్ ల్యాబ్స్‌కు వెళ్లి ప్రింట్ తీసుకుంటున్నారు. కొందరు జిరాక్స్ సెంటర్లు, మీసేవ కేంద్రాల్లో కూడా పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీస్తుండడంతో ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్లు ఉసురుమంటున్నారు. దీనికి తోడు పెరిగిన పోటీ కారణంగా క్వాలిటీ కోసం లక్షలాది రూపాయల విలువైన అధునాతన కెమెరాలను వాడాల్సిన పరిస్థితి. వినియోగదారుల ఆదరణ కొరవడడంతో పూట గడవడమే కష్టంగా ఉన్న పరిస్థితుల్లో ఇంత పెట్టుబడి ఎలా పెట్టాలో తెలియక ఫొటోగ్రాఫర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పెళ్లిళ్ల సీజన్‌లో ఫర్వాలేదు..

మిగతా రోజులు ఎలా ఉన్నా పెళ్లిళ్ల సీజన్ మాత్రం ఫొటోగ్రాఫర్లకు ఆశాజనకంగా ఉంటోంది. ఈ సీజన్‌లో రోజుకు రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు సంపాదిస్తారు. కానీ పెరిగిన పోటీ కారణంగా డిమాండ్ ఉన్న రోజుల్లో కూడా తక్కువ ధరలకే పని చేయాల్సి వస్తోందని మరి కొందరు చెబుతున్నారు.


అద్దె కూడా చెల్లించలేకపోతున్నాం



కొన్ని స్టూడియోల్లో ఫొటోలు తీయడం రానివారికి కూడా కెమెరాలు ఇచ్చి మార్కెట్‌లోకి పంపుతున్నారు. వాళ్లు తక్కువ ధరకే వచ్చీరాని నైపుణ్యంతో పని చేస్తున్నారు. దీంతో నైపుణ్యం ఉన్న ఫొటోగ్రాఫర్లకు పనిలేకుండా పోతుంది. గిరాకీ లేక స్టూడియోల అద్దెలు కూడా చెల్లించలేక నేడు ఎంతో మంది ఇళ్లకే పరిమితమయ్యారు.

- పిల్లి అనిల్‌కుమార్, ఫొటోగ్రాఫర్, రహమత్‌నగర్

కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



సుదీర్ఘ కాలం నుంచి ఈ వృత్తిలో ఉన్నా. ఒకప్పుడు కళకళలాడిన స్టూడియోలు నేడు ఉపాధి లేక వెలవెలబోతున్నాయి. వెనుకబడిన ఫొటోగ్రాఫర్లను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం చేయూతనందిస్తూ ప్రోత్సహించాలి. ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి.

- తూర్పాటి జగదీశ్వర్, ఫొటోగ్రాఫర్ సంఘం అధ్యక్షుడు

స్మార్ట్‌ఫోన్లతో ఉపాధి తగ్గింది



స్మార్ట్‌ఫోన్ల రాకతో సీనియర్ ఫొటోగ్రాఫర్లకు సైతం ఉపాధి కొరవడింది. ప్రస్తుతం చిన్న కార్యక్రమాలకు ఫొటోగ్రాఫర్లను పిలువడం లేదు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. గిరాకీ లేక.. అద్దెలు చెల్లించలేక జిల్లాలో చాలా వరకు స్టూడియోలు కనుమరుగయ్యాయి.

-బొమ్మల అశోక్‌కుమార్, కాజీపేట



టెక్నాలజీని ఎవరూ ఆపలేరు



మారుతున్న టెక్నాలజీని ఎవరూ ఆపలేరు. అయితే ఫొటోగ్రాఫర్ల పనిని ఇతర వృత్తుల వారు చేస్తుడడంతో మా ఉపాధికి గండిపడుతోంది. మీసేవ కేంద్రాలు, కలర్ జిరాక్స్ సెంటర్లలో ప్రింటింగ్ బాక్స్‌ల ద్వారా పాస్‌పోర్టు సైజ్ ఫొటోలను ప్రింట్ తీసి ఇస్తున్నారు. దీంతో మాకు ఇబ్బందులు తప్పడం లేదు. దీని వల్ల నైపుణ్యం ఉన్న ఫొటోగ్రాఫర్లకు ఉపాధి లేకుండా పోతోంది.

-మంతిని మోహన్, ఫొటోగ్రాఫర్

పాపం.. పసివాడు

- తల్లి, తండ్రి మృతితో అనాథగా మారిన బాలుడు
- దాతలు, ప్రభుత్వం స్పందించి ఆశ్రయం కల్పించాలని గ్రామస్తుల వేడుకోలు



బాలుడు కొడగాని కార్తీక్



వీరేశం(ఫైల్)

దుగ్గొండి: 12 సంవత్సరాల క్రితం తల్లి, శనివారం తండ్రి మృతి చెందారు. దీంతో ఓ బాలుడు అనాథగా మారాడు. దీనిపై దాతలు, ప్రభుత్వం స్పందించి బాలుడికి ఆశ్రయం కల్పించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని రేబల్లె గ్రామానికి చెందిన కొడగాని వీరేశం–లలిత దంపతులు వ్యవసాయ కూలీలుగా జీవనం సాగించేవారు. లలిత 12 సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటికి కార్తీక్ 3 నెలల పసికందు. దీంతో కార్తీక్‌ను నానమ్మ లచ్చమ్మ, తండ్రి వీరేశం పెంచి పోషిస్తున్నారు. ఈ క్రమంలో వీరేశం(46) శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో 12 ఏళ్ల వయసు ఉన్న కార్తీక్ అనాథగా మారాడు. తండ్రికి తలకొరివి పెట్టిన బాలుడిని చూసి గ్రామస్తులు కన్నీరుమున్నీరయ్యారు. ఊరంతా బంధువులుగా మారి అంత్యక్రియలు నిర్వహించారు. దాతలు, ప్రభుత్వం స్పందించి బాలుడికి ఆశ్రయం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ ఎన్నారై సెల్ రాష్ట్ర ప్రతినిధి శానబోయిన రాజుకుమార్ గ్రామానికి చేరుకుని కార్తీక్‌ను ఓదార్చారు. అండగా ఉండి ఆదుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మేర్గు రాంబాబు, మాజీ ఎంపీటీసీ మోహన్‌రావు, కందిపల్లి శంకర్, లింగారావు, అనిల్, నిఖిల్, ప్రసాద్, చంటి, రేబల్లె గ్రామ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

శిల్ప కళాసంపద మహాద్భుతం



ఖుష్‌మహల్‌ను తిలకిస్తున్న హైకోర్టు జడ్జి జస్టిస్ సుజయ్ పాల్



భద్రకాళి అమ్మవారి సన్నిధిలో జస్టిస్ సుజయ్ పాల్

- హైకోర్టు జడ్జి జస్టిస్ సుజయ్ పాల్

ఖిలా వరంగల్: కాకతీయుల శిల్ప కళాసంపద మహాద్భుతంగా ఉందని హైకోర్టు జడ్జి జస్టిస్ సుజయ్ పాల్ కొనియాడారు. శనివారం కాకతీయుల రాజధాని మధ్యకోటను కుటుంబ సమేతంగా సందర్శించారు. ఈ సందర్భంగా కాకతీయులు కీర్తితోరణాల మధ్య ఉన్న అద్భుత శిల్పకళాసంపదతోపాటు ఖుష్‌మహల్, రాతి, మట్టికోట అందాలు, ఏకశిల గుట్ట,శృంగారపు బావిని తిలకించారు. కాకతీయుల చరిత్ర, విశిష్టతను టూరిజం ప్రమోషన్ అధికారి సూర్యకిరణ్, పర్యాటక శాఖ గైడ్ రవియాదవ్.. జడ్జి కుటుంబ సభ్యులకు వివరించారు. కాగా, హైకోర్టు జడ్జి జస్టిస్ సుజయ్ పాల్‌ను కార్పొరేటర్లు బి. ఉమ, వి. సువర్ణ సన్మానించారు. వారి వెంట హనుమకొండ, వరంగల్ న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తీగల జీవన్‌గౌడ్, టీజీటీడీసీ కోట ఇన్‌చార్జ్ గట్టికొప్పుల అజయ్, కేంద్రపురావస్తుశాఖ కోఆర్డినేటర్ శ్రీకాంత్, మాజీ కార్పొరేటర్ బైరబోయిన దామోదర్, బోగి సురేశ్, ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం, ఎస్సై సురేశ్ పాల్గొన్నారు.

దేవాలయాలను సందర్శించిన హైకోర్టు జడ్జి

హన్మకొండ కల్చరల్ : చారిత్రక రుద్రేశ్వరస్వామి వారి వేయి స్తంభాల, భద్రకాళి దేవాలయాలను హైకోర్టు జడ్జి జస్టిస్ సుజయ్ పాల్ శనివారం సందర్శించారు. అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతించారు. పూజలు నిర్వహించిన అనంతరం అర్చకులు.. జస్టిస్‌కు తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు, మహదాశీర్వచనం అందజేశారు.

'సూపర్' ఆస్పత్రికి నిలిచిన నీటి సరఫరా

- తీవ్ర ఇబ్బందులు పడిన రోగులు
- నిలిచిన డయాలసిస్ సేవలు



ఎంజీఎం : కాకతీయ మెడికల్ కళాశాల ప్రాంగణంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి నీటి కష్టాలు తప్పడం లేదు. మున్సిపల్ నీరు సరఫరా జరిగితే తప్ప ఆస్పత్రిలో వైద్యసేవలు అందని దుస్థితి నెలకొంది. పైపు లైన్ల మరమ్మతుల నేపథ్యంలో శనివారం నీటి సరఫరా నిలిచింది. ఫలితంగా ఆస్పత్రిలో ఎలాంటి బోర్లు లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సుమారు రూ. 150 కోట్ల వ్యయంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ఆస్పత్రిని కనీ సం బోర్లు వేయకుండా ఎలా నిర్మాణం చేపట్టారు.. ఏ విధంగా సదరు కాంట్రాక్టర్‌కు అప్పటి అధికారులు బిల్లులు చెల్లించారో తెలియని పరిస్థితి నెలకొంది. సుమారు వంద మంది రోగులు చికిత్స పొందుతున్న ఈ ఆస్పత్రిలో తాగునీరు దేవుడెరుగు.. బాత్‌రూమ్‌కు వెళ్లేందుకు సైతం నీరు లేకపోవడంతో నరకయాతన అనుభవించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నిలిచిన డయాలసిస్ సేవలు..

కిడ్నీ బాధితులకు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలోని నెఫ్రాలజీ విభాగం ద్వారా డయాలసిస్ సేవలు అందిస్తుంటారు. ఈ సేవలు పొందాలంటే ఆస్పత్రికి కచ్చితంగా నీటి సరఫరా జరగాలి. అయితే ఆస్పత్రికి నీటి సరఫరా లేకపోవడంతో ఈ సేవలు నిలిచాయి. ఆస్పత్రిలో ప్రస్తుతం మూడు మోటార్లు ఉండగా రెండు కొన్ని నెలలుగా మరమ్మతులకు నోచుకోవడం లేదు. అంతేకాకుండా ఆస్పత్రికి ఇంటి అవసరాలకు సరిపడా ఉపయోగించే 150 ఫీట్ల బోరు మాత్రమే అందుబాటులో ఉంది. 250 పడకల ఆస్పత్రికి కనీసం రెండు, మూడు బోర్లు అందుబాటులో ఉంటే తప్ప రోగులకు భరోసా అందించలేం. అలాంటి నీటి సరఫరా విషయంలో అధికారుల నిర్లక్ష్యం వహించడంపై రోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నాం..

మున్సిపల్ నీటి ద్వారా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అవసరాలు తీరుతున్నాయి. ఆస్పత్రిలో బోర్ల సౌకర్యం లేదు. ప్రస్తుతం వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసి రోగులకు సేవలు అందిస్తున్నాం. నూతన బోర్లు సైతం అందుబాటులోకి తెచ్చి రోగులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం

- మురళి, సూపరింటెండెంట్, ఎంజీఎం

మహిళ దారుణ హత్య

- గుర్రంపేటలో ఘటన

భూపాలపల్లి రూరల్: మేకల కాపరిగా పని చేస్తున్న ఓ మహిళ దారుణ హత్యకు గురైంది. ఈ ఘటన ములుగు జిల్లా వెంకటాపూర్ పోలీస్ స్టేషన్ పరిధి, భూపాలపల్లి మండలంలోని గుర్రంపేటలో జరిగింది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సకినాల సరస్వతి (35) భర్త సుమారు 7 సంవత్సరాల క్రితం మృతి చెందాడు. కూతురుకు వివాహం కాగా కుమారుడు రాకేశ్ వేరే చోట నివాసం ఉంటున్నాడు. సరస్వతి గ్రామానికి చెందిన తడుక రవి వద్ద మేకలు కాపరిగా పనిచేస్తూ వారి మేకల పాకలోనే ఒంటరిగా జీవనం కొనసాగిస్తోంది. ఈ క్రమంలో శనివారం ఉదయం మేకల పాక శుభ్రం చేసేందుకు వెళ్లిన ఇతర కాపరులకు సరస్వతి దారుణ హత్యకు గురై కనిపించింది. గొంతకోసి ఉండి గురై రక్తపు మడుగులో నిర్జీవంగా ఉండడం గమనించిన వారు.. ఈ విషయాన్ని వెంటనే గ్రామపెద్దలతోపాటు పోలీసులకు తెలిపారు. దీంతో ములుగు సీఐ శంకర్, ఎస్సై సతీశ్ ఘటనా స్థలిని పరిశీలించారు. హత్యకు గల కారణాలు, నిందితుల గుర్తింపు కోసం డాగ్ స్క్వాడ్, ఫింగర్ ప్రింట్ బృందాలతో ఆధారాలు సేకరించారు. ఒంటరి మహిళ దారుణ హత్యకు గురికావడంతో గ్రామం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఈ ఘటనపై మృతురాలి సోదరుడు మధు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ శంకర్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించామని సీఐ పేర్కొన్నారు.

చుక్కా సత్తయ్య తెలంగాణకే తలమానికం

- విగ్రహావిష్కరణలో పలువురు వక్తలు



సత్తయ్య విగ్రహావిష్కరణలో పలువురు ముఖ్యులు

లింగాలఘణపురం: ఒగ్గు కథ పితామహుడు, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత చుక్కా సత్తయ్య తెలంగాణ రాష్ట్రానికే తలమానికమని తెలంగాణ క్రాంతిదళ్ వ్యవస్థాపక అధ్యక్షుడు పృథ్వీ అన్నారు. శనివారం చుక్క సత్తయ్య స్వగ్రామం మాణిక్యాపురంలో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కలిసి ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఆల్ ఇండియా యాదవ మహాసభ మహిళా విభాగం అధ్యక్షురాలు, చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, దుబాయ్ ఇంటర్నేషనల్ నెక్ట్‌లెవల్ గోల్డెన్ ఈవెంట్ చైర్‌పర్సన్ ఉపాసనతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉస్తాద్ ఒగ్గు రవి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో పృథ్వీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ దేశ ప్రధానమంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రుల చేతుల మీదుగా ఎన్నో అవార్డులు అందుకున్న చుక్కా సత్తయ్య విగ్రహం ఏర్పాటు చేసుకోవడానికి ఏడేళ్లు పట్టిందని, అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఈ కార్యక్రమానికి రాకపోవడం బాధాకరమన్నారు. చుక్కా సత్తయ్య బహుజన వర్గానికి చెందిన వాడు కావడమే ఇందుకు కారణమని, బహుజనులంతా ఏకమై రాజ్యాధికారం దిశగా పయనించాలన్నారు. బొంతు శ్రీదేవి మాట్లాడుతూ చుక్కా సత్తయ్య చనిపోయే ఇరవై రోజుల ముందు తన ఇంటికి వచ్చి మాట్లాడి తనను ఆశీర్వదించారని గుర్తు చేశారు. ఉపాసన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత కళలను దేశ, విదేశాల్లో ప్రదర్శించేందుకు కృషి చేస్తున్నామని, ఒగ్గుడోలు కథను దుబాయ్‌లో ప్రదర్శించామన్నారు. వరంగల్ కళా క్షేత్రానికి చుక్కా సత్తయ్య పేరు పెట్టాలని, ట్యాంక్‌బండ్‌పై విగ్రహం ఏర్పాటు చేసి జనగామ జిల్లాకు ఆయన పేరు పెట్టాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. సమావేశంలో చుక్కా సత్తయ్య కుమారులు ఆంజనేయులు, శ్రీశైలం, నాయకులు సేవెల్లి సంపత్, శేఖర్, ముక్దూం, ఆయా జిల్లాల కురుమ సంఘం అధ్యక్షులు పాల్గొనగా ఒగ్గు డోలు కళాకారులు, బుడిగ జంగాల కళాకారులు పాల్గొని అతిథులకు ఘన స్వాగతం పలికారు.

అతడు.. ఆమెగా

ఓ మహిళ ఫొటోతో వివాహ వెబ్‌సైట్‌లో ప్రొఫైల్

- లైక్ కొట్టిన వృద్ధుడితో ఫోన్‌లో యువతిగా గొంతుమార్చి పరిచయం
- చివరికి పెళ్లికి సై అన్న ఆటోడ్రైవర్
- వరంగల్‌కు పిలిపించి మరో ఇద్దరికి కలిసి చితకబాదిన వైనం
- బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

హసన్‌పర్తి: కుటుంబ పోషణ భారంగా మారడంతో ఆ ఆటోడ్రైవర్ సులువుగా డబ్బులు సంపాదించాలన్న ఆశతో ఓ వివాహ వెబ్‌సైట్‌లో మహిళ ఫొటోతో ప్రొఫైల్ క్రియేట్‌చేశాడు. అదే మహిళ పేర సిమ్ కార్డులు తీసుకున్నాడు. ఆ ప్రొఫైల్‌ను లైక్ కొట్టిన ఓ వృద్ధుడితో ఫోన్‌లో ఆడగొంతుతో మాట్లాడి పరిచయం పెంచుకున్నాడు. చివరికి పెళ్లి దాకా తీసుకువచ్చాడు. వరంగల్‌కు రమ్మని చెప్పి మరో ఇద్దరితో కలిసి ఆ వృద్ధుడిని చితకబాది నగదు తీసుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆ ముగ్గురిని అరెస్ట్ చేసిన పోలీసులు మహిళ కోసం గాలిస్తున్నారు. కేయూ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. హనుమకొండ రాంనగర్‌కు చెందిన గోదారి శేఖర్ ఆటో డ్రైవర్. ఆటోతో కుటుంబం గడవడం కష్టంగా మారింది. దీంతో సులువుగా డబ్బులు సంపాదించాలన్న ఆశతో పబ్లిక్‌గార్డెన్ సమీపంలో పరకాలకు చెందిన లక్ష్మి అనే మహిళతో పరిచయం పెంచుకున్నాడు. ఆమె పేరు, ఫొటోతో రెండు కంపెనీలకు చెందిన సిమ్‌కార్డులు తీసుకున్నాడు. జోడీ.కామ్ (jodi. com) వెబ్‌సైట్‌లో లక్ష్మి పేర ఓ ప్రొఫైల్ క్రియేట్ చేసి ఫొటో అప్‌లోడ్ చేశాడు. ఈ ప్రొఫైల్‌కు యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామానికి చెందిన దేవులపల్లి శ్రీనివాస్ అనే వృద్ధుడు లైక్ కొట్టి వివరాలు నమోదు చేశాడు. ఈ క్రమంలో శ్రీనివాస్‌తో శేఖర్ తన పేరును లక్ష్మిగా పరిచయం చేసుకుంటూ ఆడ గొంతుతో మాట్లాడడం ప్రారంభించాడు.

వాట్సాప్‌లో చాటింగ్..

ఆ పరిచయం వాట్సాప్ చాటింగ్ వరకు వెళ్లింది. తనకు భార్య లేనందున పెళ్లి చేసుకుంటానని దేవులపల్లి శ్రీనివాస్.. శేఖర్ (లక్ష్మి)కు చెప్పగా అంగీకరించాడు. గత నెల 25న హనుమకొండ బస్టాండ్‌కు వస్తే, తన వారు వస్తారని శ్రీనివాస్‌కు.. శేఖర్(లక్ష్మి) ఫోన్ చేసి చెప్పాడు. ఆ రోజు శ్రీనివాస్ హనుమకొండ బస్టాండ్‌కు రాగా, గోపాలపురానికి చెందిన దుర్గం రాజయ్య, లక్ష్మయ్య అనే ఇద్దరిని శేఖర్ బస్టాండ్‌కు పంపించాడు. వారు శ్రీనివాస్‌ను ఆటోలో ఎక్కించుకుని కోమటిపల్లి రైల్వేట్రాక్ వద్దకు తీసుకెళ్లారు. అప్పటికే అక్కడికి చేరుకున్న శేఖర్ వారిద్దరితో కలిసి శ్రీనివాస్‌ను చితకబాదారు. రూ.24వేలు ఫోన్ పే చేయించుకున్నారు.

బాధితుడి ఫిర్యాదు,.. కేసు నమోదు..

బాధితుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీస్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ దర్యాప్తు వేగవంతంగా చేశారు. గోపాలపురం శివారులో నిందితుడు శేఖర్‌తోపాటు దుర్గం రాజయ్య, లక్ష్మయ్యలను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు ఏసీపీ తెలిపారు. ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఏసీపీ చెప్పారు. మరో నిందితురాలు లక్ష్మి పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితులనుంచి రూ.24వేల నగదు, మూడు సెల్‌ఫోన్లు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. కేయూ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎస్సైలు రవీందర్, ప్రవీణ్ పాల్గొన్నారు. కేసును ఛేదించిన ఇన్‌స్పెక్టర్ రవికుమార్‌ను ఏసీపీ అభినందించారు.